క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ విజయ్

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్‌బీఐ మేనేజర్ విజయ్ ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు బ్యాంకు లావాదేవిలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు పొదుపు ఖాతాల ద్వారా విద్యార్థులు ఇప్పటి నుంచి డబ్బులను పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకు పొదుపు చేయడం, డబ్బులను జమ చేయడం, విత్ డ్రా చేయడం, డిజిటల్ సర్వీసింగ్, లావాదేవిలు నిర్వహించడం, జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నహీముదు ల్లాఖాన్, హెచ్‌ఎం దీప్లారాథోడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

17న తైబజార్ వేలం పాటలు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో ఈ నెల 17 తైబజార్, గింజల బజార్ టెండర్‌కు సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తామని ఈఓ నయీం తెలిపారు. డీఎల్పీఓ, గ్రామ ప్రత్యేక అధికారి సురేశ్‌బాబు ఆధ్వర్యంలో వేలం పాటలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి ఆసక్తి గల టెండర్ దారులు హాజరు కావాలని కోరారు.

పండుగపూట పస్తులేనా..?

గ్రామ పంచాయతీ కార్మికుల ఆవేదన


భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): పల్లె ప్రగతికోసం పాలకులు, అధికారులు అహర్నిషలు కృషి చేస్తున్నా.. పల్లెలను స్వచ్ఛంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి. ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా కాలనీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్న కార్మికులు హోలీ పండుగపూట పస్తులుండే పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పండుగ ఎలా చేసుకోవాలంటూ కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పద్ధతుల్లో నిరసనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత


చేగుంట మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందిస్తున్న నవీన్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు మక్కరాజీపేట గ్రామాల్లో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను అందించారు. చేగుంటలోని మోడల్ పాఠశాలలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ సమక్షంలో మక్కరాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను అందించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని నాయకులు సూచించారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇతర వస్తువులను మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్, బీసీ హాస్టల్ వార్డెన్ ప్రణయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు


బండ్ల ఊరేగింపులో గ్రామస్తులు

పాపన్నపేట(మెదక్): యూసుఫ్‌పేటలో గురువారం అనంత పద్మనాభస్వామి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల చీరలు, కాగితాలతో అలంకరించిన బండ్లను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


నర్సాపూర్: హోలీ సంబురాల్లో కాలనీవాసులు


కౌడిపల్లి(నర్సాపూర్): రాయిలాపూర్‌లో..


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం రాత్రి పట్టణాల్లో, గ్రామాల్లో పలు కూడళ్ల వద్ద కట్టెలు, పిడకలతో కాముడి దహనం చేశారు. యువకులు, చిన్నారులు రంగులు వేసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ఆచారం ప్రకారం పిడిగుద్దులు, కోలాటం ఆడారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్, టీచర్ల ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ సందర్భంగా రంగులు చల్లుకొన్నారు. అనంతరం పండుగ ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు.


మెదక్ మున్సిపాలిటీ: హోలీ సంబురాలు జరుపుకొన్న శిశుమందిర్ విద్యార్థులు


కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్లలో ..


చిన్నశంకరంపేట(మెదక్): చందాపూర్‌లో..


రేగోడ్(మెదక్): సంబురాల్లో యువకులు


తూప్రాన్ యావపూర్‌లో..


వెల్దుర్తి(తూప్రాన్): వేడుకల్లో యువకులు


మనోహరాబాద్(తూప్రాన్): పాలాటలో..

ఉదయం వేళల్లో పనులు చేయాలి


చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఆనంద్


శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్

శివ్వంపేట(నర్సాపూర్): ఎండ తీవ్రత పెరిగినందున ఉపాధి పనులు కూలీలు ఉదయం వేళల్లో చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శభాష్‌పల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ సోకకుండా కూలీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉదయం వేళల్లో మాత్రమే పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో నిర్దేశించిన పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణ, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్, తదితరులు ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి పనులకు కూలీలు భారీగా హాజరై ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు ఉపాధి పనుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యే ముందు, పనులు ముగిశాక తప్పనిసరిగా ఫొటోలు దిగాలన్నారు. కొలతల ప్రకారం డబ్బులు వస్తాయని అత్యధికంగా రూ. మూడు వందల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా కూలీలకు పనుల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ హన్మంతు, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

జీవితం నాశనం చేసుకోవద్దు

కమ్యూనిటీ ఎడ్యూకేటర్ లక్ష్మీప్రసన్న

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని కమ్యూనిటీ ఎడ్యూకేటర్ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని చిట్కుల్ అంగన్‌వాడీ కేంద్రంలో నశాముక్త్ భారత్ అభియాన్ మిషన్ పరివర్తనలో భాగంగా మహిళలకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు మాయ అనేది గ్రామీణ ప్రాంతాలకు సైతం వ్యాపించిదని, ముఖ్యంగా యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలను ముందుగా సంతోషం కోసం మొదలుపెట్టి, వాటికి వ్యసనంగా మారుతున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారితో పాటు, వారి కుటుంబాలు సైతం రోడ్డున పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. 25 ఏళ్ల లోపు యువత ఎక్కువగా వీటికి బానిసలు అవుతున్నారన్నారు. చాపకింద నీరులా వ్యాపిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం నశాముక్త్ అభియాన్ భారత్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో పలుచోట్ల డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, మత్తు బానిసలకు, వాటి నుంచి విముక్తిని చేసి, కొత్త జీవితాలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నర్సాపూర్‌లో సైతం డీ-అడిక్షన్ కేంద్రం ఉందని, అత్యవసర అవసరమైతే 14446 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, షహనాజ్‌లు పాల్గొన్నారు.


చిట్కుల్ అంగన్‌వాడీ కేంద్రంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీప్రసన్న

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


జాజితండాలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


తూప్రాన్: జెండాపల్లిలో ..


టేక్మాల్(మెదక్): వెల్పుగొండలో..


పర్కిబండలో ప్యాడ్‌లను అందజేస్తున్న దాతలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని జాజితండా ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఒక్కరోజు విధులు నిర్వహించారు. ఉపాధ్యాయులు మౌనిక, దీప్తి, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ సునీతను మాజీ సర్పంచ్ రమేశ్, తండావాసులు ఘనంగా సన్మానించారు.

తూప్రాన్: మండలంలోని జెండాపల్లిలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం విద్యార్థులు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన అర్పిత, విరాట్ సింగ్, పర్సింగ్, సుశాంత్, ప్రణతి శ్రీలు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

వేల్పు గొండలో ..

టేక్మాల్(మెదక్): మండలంలోని వేల్పుగొండ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓగా వర్ష, హెచ్‌ఎంగా విశాల్, ఉపాధ్యాయులుగా మహేశ్వరి, శ్రీనిధి, శ్వేత పవిత్రలు వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు సంతోష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ పాల్గొన్నారు.

పర్కిబండలో ..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వర్షిక, విఖిల వారి తండ్రి వెంకటేష్ జ్ఞాపకార్థం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టైషనరీ, పెన్నులు, పరీక్షాప్యాడ్‌లను అందజేశారు. విద్యార్థులు బాగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు, మంచ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'నేడు గ్రహణం లేదు'

శివ్వంపేట(నర్సాపూర్): శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఎలాంటి గ్రహణం లేదని వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ తెలిపారు. మన ప్రాంతంలో లేని గ్రహణం గురించి ఎలాంటి నియమాలు పాటించాల్సిన అవసరం లేదన్నారు.

ప్రహరీ పనులు ప్రారంభం


బొడ్మట్‌పల్లిలో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో రూ.25లక్షలతో ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను గురువారం జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర రాజనర్సింహ గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సరోజ మల్లేశం, మాజీ మండల ఉపాధ్యక్షురాలు మంజుల రాజుగౌడ్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు శంకరప్ప, యూత్ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, పాపయ్య, సాగర్, కిషోర్, బాలరాజ్, రాజేశ్వర్‌గౌడ్, మల్లేశం, మహేశ్‌రెడ్డి, అవినాష్, విఠల్, మందిర్, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పైతరలో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామంలో కొలువైన మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరగనున్నాయి. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పచ్చని పందిట్లో స్వామివారి అమ్మవార్ల కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఆలయ కార్యక్రమాలు రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి వారి ఆధ్వర్యంలో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు


చేగుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ శివచంద్ర

చేగుంట(తూప్రాన్): ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర అన్నారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉన్నతంగా ఎదగడానికి చదువుకోవాల్సిన అంశాలపై శివచంద్ర ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేయకుండా చదవాలని చదివిన విషయాలను గుర్తు చేసుకోవడంతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. ఉన్నతంగా ఎదిగిన వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారేనన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, ఇన్‌చార్జి హెచ్‌ఎంలు రఘుపతి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్, రాధ, రమాదేవి, లక్ష్మణ్, మనోహర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

మనోహరాబాద్(తూప్రాన్): తమ పాఠశాలలో 12 ఏళ్లుగా పాఠశాలలో బోధన చేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న వారిని గ్రామస్తులు సన్మానించి వీడ్కోలు పలికారు. గురువారం మండలంలోని తుపాకులపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మాలతి, రమేశ్‌లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయురాలు అనిత, గ్రామ నాయకులు నాగభూషణం, కోమురెల్లి, ఆంజనేయులు, ముత్యాలు, నాగభూషణం, సత్యానారాయణ, రవి, మహేశ్ తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థులకు వాటర్ పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టీ.మాందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వేసవిలో విద్యార్థులు తీర్చుకునేందుకు అనువుగా వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలు ఉపాధ్యాయురాలు శోభారాణి 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు మిల్టన్ వాటర్ బాటిళ్లను సొంత డబ్బులతో అందించారు. అనంతరం శోభారాణి సేవలను హెచ్‌ఎం ఫణింద్రాచారి, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

◆ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ ఖమర్‌సుల్తాన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, టీహెచ్‌ఆర్, ఆరోగ్య లక్ష్మి ఒక్కపూట భోజనం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు ఆట పాటలద్వారా విద్యబోధన చేయాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. మహిళలు రక్తహీనతను నివారించుకునేందుకు ఆకుకూరలు, పాలు, కోడి గుడ్లు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ అనురాధ, మహిళలు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు, మురికి కాల్వకు రూ. 4లక్షలు మంజూరు కావడంతో గురువారం పనులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామాగౌడ్, మాజీ ఎంపీటీసీలు శంకర్‌గౌడ్, కిషోర్‌గౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశోధనలపై అవగాహన అవసరం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్
- రీసెర్చ్ మెథడలాజీపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్

నర్సాపూర్ రూరల్: చదువుతో పాటు పరిశోధనలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఐపీఈ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఒకరోజు రీసెర్చ్ మెథడలాజీ (పరిశోధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... పరిశోధన పద్ధతులు విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు మంచి ఉద్యోగానికి ఉపయోగపడతాయన్నారు. ఐపీఈ సభ్యులు డాక్టర్ వాసంతి మాట్లాడుతూ.. పరిశోధన పద్ధతుల విషయాలను శోధించి నూతన పరిశోధనలు ఎలా చేయాలో వివరించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు, కొత్త పరిశోధనలు, ఆయా రకాల నైపుణ్యాల్లో అవగాహన పొందుతూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐస్ ప్రిన్సిపాల్ సమీరా, అధ్యాపకులు డాక్టర్ సురేశ్‌కుమార్, ఎండీ ఖాజా అరిఫ్, రమేశ్, రుక్మిణిదేవి, మహేందర్‌రెడ్డి, రాజు, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ భూమి

తునికి దేవులతండాలో కబ్జా స్థలంలో బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కౌడిపల్లి(నర్సాపూర్): ఇది ప్రభుత్వ భూమి ఎవరైన ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని తునికి దేవులతండాలో సర్వేనంబర్ 245లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూంల కోసం కేటాయించిన స్థలాన్ని ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి, కడీలు పాతిన విషయాన్ని సాక్షి దినపత్రికలో ఈనెల 12న డబుల్‌బెడ్రూంల స్థలం కబ్జా వార్త ప్రచురించిన విషయం విదితమే. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆంజనేయులు విచారణ చేశారు. ఆర్‌ఐ శ్రీహరి, సర్వేయర్ మొగులయ్య, ఏఎస్‌ఐ శ్రీనివాస్ ఇతర అధికారులు ఆ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు.

బోర్డు తొలగింపు.. తిరిగి ఏర్పాటు

ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డు ఏర్పాటు చేసిన కొద్దిసేపటికి ఈస్థలం మాది అంటు తండాకు చెందిన శ్రీను, లక్ష్మణ్ కుటుంబాలకు చెందిన మహిళలు బోర్డును తొలగించారు. ఈ విషయమైన ఆర్‌ఐ శ్రీహరి రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోర్డు తొలగించిన వారిపై కేసునమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించడంతో తిరిగి అక్కడే బోర్డును ఏర్పాటు చేశారు.


తునికి దేవులతండాలో బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

హోలీలో పిడిగుద్దులాట

- కొంతన్‌పల్లిలో ఘర్షణ వాతావరణం
- పోలీసుల బందోబస్తు మధ్య కార్యక్రమం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి కొంతన్‌పల్లిలో హోలీ పండుగకు ముందురోజు నిర్వహించిన పిడిగుద్దులాటలో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కొంతన్‌పల్లిలో ఎన్నో ఏళ్ల నుంచి హోలీ పండుగకు ముందురోజు పిడిగుద్దులాట ఆడడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామంలోని ఎస్సీ బుడగవర్గం (వతందార్లు) డప్పులతో ఘటం ఊరేగింపు చేస్తారు. అనంతరం గ్రామ చావిడి వద్ద గ్రామస్తులందరూ కలిసి పిడిగుద్దులాట నిర్వహిస్తారు. గురువారంఈ ఘటం ఊరేగింపు ఎస్సీ కలకంటి వర్గం పాల్గొట్టామని చెప్పడంతో వతందార్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొని వాగ్వివాదంకు దిగారు. విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, శివ్వంపేట, తూప్రాన్, వెల్దుర్తి, మనోహరాబాద్ ఎస్‌ఐలు, ఇతర పోలీసు బలగాలు గ్రామానికి చేరుకుని గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. గతంలో నిర్వహించిన మాదిరిగానే బుడగ వర్గం వతందార్లు ఘటం ఊరేగింపు చేపట్టాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి సూచించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య కార్యక్రమం నిర్వహించారు.


ఆందోళనకారులకు నచ్చచెబుతున్న పోలీసులు